## క్లుప్తంగా

### సీపీఎస్‌ను రద్దు చేయాలి

**ఉప్పునుంతల:** సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వి హన్మంత్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోకల సతీష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్‌రావు, చంద్రశేఖర్, రవి, శేఖర్, రాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన భోజనం

**పెద్దకొత్తపల్లి:** ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన భోజనం అందుతుందని మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడు అన్నారు. మంగళవారం మండలంలోని ముష్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. 25 రోజులుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల చైర్మన్ లింగమ్మ ముందుకు వచ్చి భోజనం వడ్డిస్తున్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

**కోడేరు:** మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్లకు ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్లు మంజూరు అయిన వారు ఇంటి నిర్మాణం చేపడితే దశల వారిగా బిల్లులు మంజూరు అవుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈ నాగరాజు, కాంగ్రెస్ నాయకులు చలపతి రావు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు సురేష్, చామంతి రాజు, మాజీ వార్డు సభ్యులు రాజు, సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### మొక్కల పంపిణీ

**తిమ్మాజిపేట:** మండలంలోని పోతిరెడ్డిపల్లిలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి పర్వీన్‌బేగం ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. జామ, సీతాఫల్ మొక్కలను అందజేశారు. ప్రతి ఒక్కరు ఇళ్ల వద్ద మొక్కలు నాటుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

### డిప్యూటీ సీఈఓ ఆకస్మిక తనిఖీ

**తిమ్మాజిపేట:** మండలంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా డిప్యూటీ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి గోపాల్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు గదులను పరిశీలించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నివేదికలను, పలు రికార్డులను తనిఖీ చేశారు. కార్యాలయ సమీపంలో నిర్మిస్తున్న మండల పరిషత్ భవనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ లక్ష్మీదేవి, సీనియర్ అసిస్టెంట్ రఘు, సూపరింటెండెంట్ ధర్మానాయక్, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

### అండర్ పాస్ నిర్మించాలని వినతి

**కల్వకుర్తి రూరల్:** మండలంలోని తర్నికల్ మీదుగా వెళ్తున్న తిరుపతి 167 జాతీయ రహదారిపై గ్రామం వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ మంగళవారం హైవే డివిజనల్ ఇంజనీర్ రమేష్ బాబుకు గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు. గతంలో ఈ రహదారిపై ఇద్దరు దుర్మరణం చెందారని, అనేక మంది గాయపడ్డారని గుర్తు చేశారు. రుక్మద్దీన్, దేవయ్య, శ్రీనివాసులు, రమేష్, వెంకటయ్య, సురేష్ గౌడ్ ఉన్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

**లింగాల:** సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎంపీఓ సురేందర్, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

### మారేడుమాన్‌దిన్నెలో బోనాల పండుగ

**పెద్దకొత్తపల్లి:** మండలంలోని మారేడుమాన్‌దిన్నెలో మంగళవారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు మొలుకల బుట్టి బోనం ఎత్తుకొని పోచమ్మ తల్లికి నైవేద్యం అందించి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, మేకల చంద్రయ్య యాదవ్, మాజీ సర్పంచ్‌లు సునీతబాలజీనాయక్, అరవింద్, చిన్నబాలయ్య, కొమ్ము నిరంజన్, వెంకటస్వామిగౌడు, లక్ష్మినాగమ్మ, శ్రీకృష్ణ, శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

### సమయపాలన పాటించాలి

**లింగాల:** ఉపాధ్యాయుల సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ కోరారు. మంగళవారం మండలంలోని మానాజీపేట, వల్లబాపూర్, రాంపూర్ పాఠశాలలను ఎంఈఓ సందర్శించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

# ప్రజాపాలన దినోత్సవానికి సర్వం సిద్ధం



కలెక్టరేట్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్:** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సెప్టెంబర్ 17ను పురస్కరించుకొని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయం ఆవరణలో జరిగే జాతీయ పతాకావిష్కరణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. మంగళవారం ఐడీఓసీ ప్రాంగణంలో ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరై జాతీయ జెండా ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం ఆయా పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ సురేష్ బాబు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, తహసీల్దార్ తబితా రాణి తదితరులు ఉన్నారు.

**తాడూరు:** తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు మండలంలో ఆయా గ్రామాలలోని పంచాయతీలలో ప్రభుత్వ కార్యాలయ ఆవరణంలో జాతీయ జెండాను ఎగురవేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

**మన్ననూర్:** పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మన్ననూర్‌లోని రైతు వేదక ప్రాంగణంలో పోషన్ బీ పడావ్‌బీ కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పాటూ నిర్వహించే శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, చిన్నపిల్లలు, కిషోర బాలికలు పోషకాహారం తీసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లకు చీరలు పంపిణీ చేశారు. గిరిజన ఆశ్రమ, సంక్షేమ వసతి గృహాలలో విధులు నిర్వహించే వర్కర్లు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హరినారాయణ గౌడ్, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రవి, సంతోష్, రేణయ్య అంగన్‌వాడీ ఏసీడీపీఓ కమల, సూపర్‌వైజర్లు పద్మ, స్వర్ణ, సువర్ణతో పాటూ అమ్రాబాద్, పదర, అచ్చంపేట మూడు సెక్టార్లలకు సంబంధించిన అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

**విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట**

**బల్మూర్:** విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండలంలోని చెంచుగూడెం గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు యూనిఫామ్స్ ఆయన పంపిణీ చేశారు. పాఠశాలలో బాత్‌రూంలు, సీసీ, శిథిలావస్థకు చేరిన భవనాల మరమ్మతుకోసం రూ.24 లక్షలు మంజూరయ్యాయన్నారు. అదేవిధంగా ఐసీడీఎస్ బల్మూర్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండలంలోని రాంనగర్‌తండా రైతు వేదిక భవనంలో నిర్వహించిన పోషణ్ అభియాన్–1 అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సీడీపీఓ దమయంతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ రాఘవులు, ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం శంకర్ నాయక్, నాయకులు శ్రీపతిరావు, నర్సింగ్‌రావు, జామీర్, మైమ్‌ద్, ఆయాశాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఓజోన్ పొర రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ మదన్‌మోహన్

**కందనూలు:** ఓజోన్ పొరను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నాగర్ కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మదన్మోహన్ అన్నారు. మంగళవారం ప్రపంచ ఓజోన్ డే సందర్భంగా కళాశాలలో రసాయన శాస్త్ర విభాగ అధ్యాపకులు ఉమాదేవి, శోభారాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కళాశాల అధ్యాపకుల సమక్షంలో ఓజోన్ డే అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ అంజయ్య, వనిత , రామకృష్ణ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**విద్యార్థులకు అవగాహన**

**లింగాల:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఓజోన్ పొరపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల మైదానంలో 0–3 ఆకారంలో విద్యార్థులు కూర్చున్నారు. బయోసైన్స్ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌శర్మ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శంకరయ్య, ఉపాధ్యాయులు రామచంద్రయ్య, సురేష్, కవితరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

# మంత్రి కార్యాలయం ఎదుట హాస్టల్ వర్కర్ల ధర్నా



కొల్లాపూర్‌లో మంత్రి క్యాంపు కార్యాలయం ఎదుట బైఠాయించిన హాస్టల్ వర్కర్లు

**కొల్లాపూర్:** పట్టణంలోని మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంపు కార్యాలయం ఎదుట ఎస్టీ హాస్టల్, ఆశ్రమ పాఠశాలల వర్కర్లు మంగళవారం ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివవర్మ మాట్లాడారు. గిరిజన హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మంత్రి వ్యక్తిగత కార్యదర్శి గణేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దామోదర్, వెంకటేష్, శారదమణి, బాలస్వామి, రమణమ్మ, పార్వతమ్మ, సాయికుమార్, ఊషమ్మ తదితరులు ఉన్నారు.

**కార్మికుల సమస్యలు పరిష్కరించాలి**

**కల్వకుర్తి రూరల్:** పట్టణంలో ఎస్టీ హాస్టల్, ఆశ్రమ పాఠశాలల వర్కర్ల నిరవధిక సమ్మెకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ మద్దతు తెలిపారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏపీ మల్లయ్య, సంతోష్, రవి, నరసమ్మ, అలివేలు, యాదమ్మ, అనిల్, అరవింద్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి పోషణ మాసోత్సవాలు

**అచ్చంపేట:** మంచి పోషక విలువలున్న ఆహారం అమృతంతో సమానం. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాలతో కూడిన ఆహారాన్ని నిత్యం అందిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. ఇందుకోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సమతుల్య పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్యం, పోషకాహారాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 16 వరకు పోషణ మాసోత్సవాలను నిర్వహిస్తున్నారు. గర్భిణుల ఆరోగ్య రక్షణ, రక్తహీనత నివారణ, పిల్లల ఎదుగుదల పర్యవేక్షణ, పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. జిల్లాలో 1,131 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాల్లో ప్రజలు, చిన్నారుల తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ పండుగ వాతావరణంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**ప్రత్యేక నిధులు..**

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేలా అంగన్‌వాడీ సిబ్బందితో ప్రతి ఇంటికి పోషణ సందేశం చేరవేసేందుకు కార్యచరణ రూపొందించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రతి ఐసీడీఎస్ ప్రాజెక్టుకు రూ.30వేలు, ప్రతి జిల్లాకు రూ.50వేల చొప్పున నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో గ్రామ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు పోషణపై చైతన్య కార్యక్రమాలు, ఆరోగ్య పరీక్షల క్యాంపులు నిర్వహించాల్సి ఉంటుంది. జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించడం, చక్కెర, ఉప్పు, నూనె వాడకంపై ప్రజల్లో అవగాహన పెంచేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపడతారు. 'వోకల్ ఫర్ లోకల్' నినాదంతో గ్రామీణ స్థాయిలో ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించి.. ఆత్మ నిర్భరతను పెంచే కార్యక్రమాలు నిర్వహిస్తారు.

**ప్రత్యేక కార్యక్రమాలు**

పోషణ మాసంలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పిల్లల ఎత్తు, బరువు, కొలతలు సేకరించడం, గర్భిణుల బరువు, భుజం కొలతలు తీసుకోవడం, పోషకాహారంపై అవగాహన కల్పించి రోగ నిరోధక శక్తి పెంచడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. తక్కువ బరువు ఉన్న పిల్లలకు వైద్య పరీక్షలు, మందులు, ఉడికించిన కోడిగుడ్లు, మురుకులు, బాలమృతం, బాలమృతం ప్లస్ పంపిణీ చేయడంతో పాటు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్నారు. పండ్లు, ఆకుకూరల ప్రదర్శన, చేతులను శుభ్రంగా కడుక్కునే విధానాన్ని వివరించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్ల ఏర్పాటు, సీ విటమిన్ అధికంగా ఉండే పండ్లతోటల పెంపకం, ఆరోగ్యం కోసం యోగాసనాలపై అవగాహన కల్పిస్తారు.

**కొలతలు తీసుకునే విధానం**

గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారుల భుజం చుట్టు కొలతల విధానాన్ని అనుసరిస్తున్నారు. భుజం వృద్ధి ద్వారా గర్భిణులతో పాటు వారి గర్భంలో ఉన్న శిశువు పెరుగుదల, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తెలుసుకుంటున్నారు. నిర్వాహకులకు ఇందుకోసం కొలతల టేపులు అందించారు. గర్భిణులు, పిల్లల ఎడమ భుజాన్ని 60 డిగ్రీల కోణంలో వంచి తర్వాత ఎడమ చేతి చివర భాగం వరకు ఎంత పొడవుందో గుర్తిస్తున్నారు. అందులో సగ భాగాన్ని గుర్తించి అక్కడ చుట్టు కొలత తీసుకుంటున్నారు. తద్వారా ఆరోగ్య పరిస్థితిని బేరీజు వేసి పోషకాహార లోపాన్ని గుర్తిస్తారు. కిశోర బాలికల్లోనూ ఇదే విధానం కొనసాగిస్తారు.

## పోషకాహార లోపం నివారించాలి

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహార విలువలపై నెల రోజుల పాటు పోషక మాసోత్సవాలు నిర్వహిస్తున్నాం. ప్రతిరోజు వివిధ రకాల కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు చేపట్టే అవగాహన కార్యక్రమాలపై పర్యవేక్షణ కొనసాగిస్తాం. పోషకాహార లోపాన్ని అధిగమించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

– లక్ష్మి, ఐసీడీఎస్ సీడీపీఓ, అచ్చంపేట

### ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ వేడుకలు

**కొల్లాపూర్:** పట్టణంలోని ఆర్టీసీ డిపో గేట్ ఎదుట ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్మిక సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించారు. యూనియన్ రీజియన్ కార్యదర్శి సింగారం వెంకటయ్య జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు అంబయ్య, కార్యదర్శి మధుసూదన్, నాయకులు బాలస్వామి, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, సీపీఎం నాయకులు శివవర్మ, సలీం తదితరులు ఉన్నారు.

### హాస్టల్ తనిఖీ చేసిన ఏఎస్‌డబ్ల్యూఓ

**అచ్చంపేట రూరల్:** పట్టణంలోని ఎస్సీ బాలుర వసతిగృహాన్ని మంగళవారం ఇన్‌చార్జ్ ఏఎస్‌డబ్ల్యూఓ పాండునాయక్ తనిఖీ చేశారు. హాస్టల్‌లోని వసతులు పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. వార్డెన్ మల్లయ్య, తదితరులు ఉన్నారు.

### జాతీయ స్థాయి క్రీడలకు అంజలి ఎంపిక

**కల్వకుర్తి రూరల్:** మండలంలోని రఘుపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన విద్యార్థి అంజలి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక అయింది. ఈనెల 19 నుంచి 22 వరకు మహారాష్ట్ర లోని మల్కాపూర్ లో జరుగనున్న సబ్ జూనియర్ అత్యపత్య జాతీయ స్థాయి పోటీలలో ఆమె ఆడనుంది.

### స్థానిక ఎన్నికల్లో సత్తాచాటుదాం



**అమ్రాబాద్:** స్థానిక ఎన్నికల్లో సత్తాచాటుదామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సోలంకి శ్రీనవాస్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రలో బీజేపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బుధవారం అచ్చంపేటకు రానున్నారని తెలిపారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగిశెట్టి నాగరాజు, బలుమూరి జానకి శ్రీనివాసులు, రాజు ఉన్నారు.

**సేవపక్షాన్ని విజయవంతం చేయాలి**

**లింగాల:** బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సేవాపక్షాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గువ్వని నవీన్ పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని కోదండరామాలయం ఆవరణలో సేవాపక్షం మండల కార్యశాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు సేవా పక్షం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 17న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజును పురస్కరించుకొని రక్తదాన శిబిరం, ఆత్మ నిర్భర్, వికసిత్ భారత్ అంశాలపై అసెంబ్లీ స్థాయిలో చిత్రలేఖనం, మండల కేంద్రంలో స్వచ్ఛభారత్, దివ్యాంగులకు సన్మానం, ఉపకరణాల పంపిణీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మండల సేవా పక్షం కన్వీనర్ అతినారపు సాయిసాగర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బీజేపీతోనే పేదల సంక్షేమం**

**చారకొండ:** బీజేపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షుడు చెలమోని కృష్ణ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించిందన్నారు. 17న తెలంగాణ విమోచన దినోత్సవంతో పాటు భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని ఘనంగా నిర్వహిద్దామని కోరారు. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, మాజీ ఎంపీ పోతుగంటి భరత్ ప్రసాద్ అచ్చంపేటకు రానున్న సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేణు శర్మ, హరిబాబు, శ్రీకాంత్, చంద్రారెడ్డి, ఏదిరే రవీందర్, ఈదమయ్య, జంగయ్య, రాములు తదితరులు ఉన్నారు.

### మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

**నాగర్‌కర్నూల్/కందనూలు:** మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఇందిరా మహిళా శక్తి, మత్స్యశాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నీలి విప్లవ పథకం కింద సంచార చేపల విక్రయ వాహనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన మహిళలకు చేపల విక్రయ వాహనాలను క్యాంపు కార్యాలయంలో ఆయన అందజేశారు. నాగర్ కర్నూల్ మండలం శ్రీపురం గ్రామం ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా నిర్మించిన సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలకు హాజరయ్యారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. డీఈవో రమేష్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మదన్మోహన్మాజీ కౌన్సిలర్స్, లబ్ధిదారులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టాలి



**బిజినేపల్లి:** ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టాలని వ్యవసాయ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ పోగ్రాం ఆఫీసర్ ఎస్.నవత కోరారు. మంగళవారం మండలంలోని మంగనూర్‌లో అధిక వర్షపు నీటిని ఏ విధంగా వినియోగించుకోవాలో రావేఫ్ విద్యార్థులు రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీరమ్య, నవత లు మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల సమీపంలో పాంపాండ్స్ ఏర్పాటు చేసుకోవాలని, గుట్టల పరిసర ప్రాంతాల్లో కందకాలు వంటివి ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏఈఓ క్రాంతికుమార్, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

### యూరియా సరఫరాలో కాంగ్రెస్ విఫలం

**తిమ్మాజిపేట:** యూరియా సరఫరాలో కాంగ్రెస్ విఫలం అయ్యిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతుబంధు మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గోపిగౌడ్‌లతో కలిసి వారు మాట్లాడారు. యూరియా కోసం రైతులు రాస్తారోకో చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. సమావేశంలో నాయకులు రాందేవ్‌రెడ్డి, శ్రీనివాస్, హుసేనీ, సత్యం, నర్సిరెడ్డి, వెంకటేష్, సైఫ్, ఇబ్రహీం, ప్రశాంత్, హుసేనయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఈకేవైసీ తప్పనిసరి



**మన్ననూర్:** భారతీయ స్టేట్ బ్యాంకులో (ఎస్‌బీఐ) ఖాతాదారులు ఈకెవైసీ తప్పనిసరి చేసుకోవాలని మన్ననూర్ మేనేజర్ బానావత్ రాములు విలేకరులకు తెలిపారు. బ్యాంకు సమీపంలో వారం రోజుల పాటు ఈకెవైసీ శిబిరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్‌ఆఫీసర్ ఉపేందర్, శంకరయ్య తదితర సిబ్బంది పాల్గొన్నారు.

### బీఎస్పీ కార్యాలయానికి స్థలం కేటాయించాలి

**నాగర్‌కర్నూల్ రూరల్:** బీఎస్పీ కార్యాలయానికి స్థలం కేటాయించాలని కోరతూ మంగళవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ బదావత్ సంతోష్‌కు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ వినతి పత్రం అందించారు. అసెంబ్లీ ఇన్‌చార్జ్‌లు కల్యాణ్, బిసమోళ్ల, యెసేఫ్, రాష్ట్ర మాజీ ఈసీ మెంబర్లు పృథ్వీరాజ్, మిద్దె శివప్రసాద్, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న బిఎస్పీ వనపర్తి జిల్లా ఇన్‌చార్జ్ మిద్దే మహేష్, ఉపాధ్యక్షుడు రామన్న, శంకర్, దాస్, కృపానందం, కురమయ్య, బాలనాగులు, శేఖర్, వీరబాబు, సాయిబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### క్రీడలతో ఉజ్వల భవిష్యత్

**వెల్దండ:** క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్ మంగళవారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. డివిజన్ స్థాయి క్రీడలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఖో–ఖోకు 44 మంది, కబడ్డీ 40, వాలీబాల్ 32 మంది చొప్పున ఆయా పాఠశాలల విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. త్వరలోనే కల్వకుర్తిలో డివిజన్ స్థాయి గేమ్స్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడు, ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, ఎంపీఓ లక్ష్మణ్, నోడల్ అధికారి రవీందర్, ప్రిన్సిపల్ శ్రీధర్, ఆయా పాఠశాలల పీఈటీలు తదితరులు ఉన్నారు.

### విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు

**తిమ్మాజిపేట:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాల్య వివాహాలు దానికి గల కారణాలు, పరిణామాలు, బాలికలకు రక్షణ కల్పించే చట్టాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అదేవిధంగా బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కార మార్గాలు, విద్య ప్రాముఖ్యతపై ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. గెలుపొందిన వారికి ఎంఈఓ సత్యనారాయణ శెట్టి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సాయిరెడ్డి, శివరాజ్, నరేందర్, బాలయ్య, పరాందాములు, జంగయ్య, సింహయ్య, అనిత, వెంకటస్వామి, ప్రసన్నలక్ష్మీ, ప్రసన్న కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

### అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన

**తాడూరు:** మండలంలోని అంతారం గ్రామానికి చెందిన అర్జున్‌పై దాడిని నిరసిస్తూ మంగళవారం అంబేడ్కర్ విగ్రహం ఎదుట కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న నిరసన తెలిపారు. కులం పేరుతో దూషించి దాడి చేసిన గ్రామానికి చెందిన చంద్రశేఖర్, నవీన్, నాగరాజులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నాయకులు బీమయ్య, శివుడు, లక్ష్మయ్య, రాంచంద్రయ్యలు పాల్గొన్నారు.

### ప్రతిగ్రామంలో క్షయవ్యాధి నిర్ధారణ శిబిరాలు



**నాగర్‌కర్నూల్ క్రైం:** ప్రతిగ్రామంలో క్షయవ్యాధి నిర్ధారణ శిబిరాలు ఏర్పాటు చేస్తునట్లు ఇన్ చార్జ్ డీఎంహెచ్‌ఓ రవికుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని గగ్గలపల్లిలో క్షయవ్యాధి పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరానికి వెంకటాపూర్, పులజాల, మల్కాపూర్ గ్రామాల నుంచి క్షయ వ్యాధి అనుమానితులను ఎక్స్ రే పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ శిబిరాన్ని సందర్శించి ఆయా గ్రామాల ప్రజలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గతంలో క్షయ వ్యాధికి గురైన వారితో పాటు వారి కుటుంబ సభ్యులకు మొత్తం 220 వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పెద్ద ముద్దునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వాణి, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి రాజగోపాల చారి, పర్యవేక్షకులు జ్యోతి, ప్రమీల, శ్రీను పాల్గొన్నారు.

### గ్రీన్ బోర్డుల పంపిణీ



**తెలకపల్లి:** మండల కేంద్రంలోని సీపీఎస్ పాఠశాలలో కూచుకుళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి సౌజన్యంతో మంగళవారం ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి పాఠశాలలకు మూడు గ్రీన్‌బోర్డులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్ల యాదయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎం శోభన్‌బాబు, ఉపాధ్యాయులు కరుణశ్రీ, రాధిక, అనిల్‌కుమార్, జిలాని, ఎల్లస్వామి, రామకృష్ణ, కిరణ్, రాముడు రాజు పాల్గొన్నారు.

# తీరని యూరియా కష్టాలు



అచ్చంపేట పీఏసీఎస్ కార్యాలయం వద్ద బారులు తీరిన రైతులు

**సాక్షి, నెట్‌వర్క్:** జిల్లా వ్యాప్తంగా రైతులకు యూరియా కష్టాలు తీరడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సింగిల్‌విండో కేంద్రాల వద్ద అన్నదాతలు బారులు తీరుతున్నా అవసరమైన యూరియా సరఫరా లేకపోవడంతో నిరాశతో ఇళ్లకు వెళ్తున్న దృశ్యాలే కనబడుతున్నాయి. కొన్న చోట్ల వచ్చిన కొద్దిపాటి యూరియాను పోలీసుల పహారా నడుమ పంపిణీ చేస్తున్నారు.

- అచ్చంపేట పీఏసీఎస్ కార్యాలయం వద్ద మంగళవాంరం రైతులు బారులు తీరారు. వారం రోజులుగా యూరియా కోసం తిరుగుతున్నా.. ఒక బస్తా దొరకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద పోలీసు పహారాలో రైతులకు ఒక్కొక్క బస్తా యూరియాను అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శిరీష, సింగిల్ విండో అధికారి సిరాజ్ పాల్గొన్నారు.
- ఉప్పునుంతల మండల కేంద్రంలోని మన గ్రోమోర్ సెంటర్‌కు యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు తెల్లవారకముందే భారీ సంఖ్యలో రాగా ఏఓతో పాటు పోలీసుల సహకారంతో ఉదయం 10 గంటలకు పంపిణీని ప్రారంభించారు.
- కల్వకుర్తి పీఏసీఎస్ కార్యాలయం వద్ద 130 మంది రైతులకు రెండు బస్తాల చొప్పున యూరియా సరఫరా చేశామని, ఆగ్రోస్ వద్ద బుధవారం రైతులకు టోకెన్లు జారీ చేసి యూరియా పంపిణీ చేస్తామన్నారు.
- తాడూరు సింగిల్ విండో కార్యాలయం వద్ద ఉదయం నుంచే రైతులు యూరియా కోసం బారులు తీరారు.